RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 306 పేజీలు - 08 బుధవారం 30 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి

- పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు అనుమతివ్వండి
- పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయండి
- కృష్ణా జలాల వినియోగంపై టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి
- మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించాం
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి
- మంత్రి సీఆర్ పాటిల్ తో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం



2లో

## ఖర్గే పాల్గొన్న వేదికను శుద్ధి చేయడం దారుణం

- దళితులు, ఆదివాసీలు హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి: భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29:** దళితులు, ఆదివాసీలపై వివక్ష, దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని భట్టి అన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా గతంలో జరిగిన ఉద్యమాలను, మిగతా2లో...



## మయన్మార్‌లో వైమానిక దాడి..

- అరాకన్ ఆర్మీ ప్రాంతంలో సైన్యంపై దాడి
- 49 మంది మృతి, 58 మందికి గాయాలు

**తొలి అక్షరం/మయన్మార్, సెప్టెంబర్ 29 :** మయన్మార్ పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో, తిరుగుబాటుదారుల బృందమైన అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో సైన్యం జరిపిన వైమానిక దాడిలో కనీసం 49 మంది మరణించగా, 58 మంది గాయపడ్డారు. అరాకన్ ఆర్మీ, సహాయక చర్యలలో పాల్గొన్న ఒక అధికారి ప్రకారం, సోమవారం క్యౌక్తావ్ టౌన్‌షిప్‌లోని ఒక స్థానిక మార్కెట్ సమీపంలో ఒక యుద్ధ విమానం రెండు బాంబులను జారవిడిచింది. మృతులలో మార్కెట్ వ్యాపారులు, సరుకులు కొనడానికి వచ్చిన వినియోగదారులు, రోడ్డుపై నడుస్తున్న సాధారణ ప్రజలు ఉన్నారని చెబుతున్నారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉందని అరాకన్ ఆర్మీ పేర్కొంది. ఘటనా స్థలంలోని సహాయక సిబ్బంది నుండి అందిన సమాచారం ఆధారంగా, రఖైన్‌లో సహాయక చర్యలలో పాల్గొంటున్న సీనియర్ అధికారి వాయ్ హ్టూన్ ఆంగ్ మృతుల సంఖ్యను మిగతా2లో...




2లో

## తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

- గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి
- తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ వెల్లడి
- తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటన
- భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో భేటీ
- వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చ

## ఏడాదిలో సొంతింటి కల సాకారం

- నగరం నడిబొడ్డున కోట్ల విలువైన స్థలాల్లో 'ఇందిరమ్మ టవర్స్'
- రూపాయి ఖర్చు లేకుండా లబ్ధిదారుల పేరిటే ఇళ్ల రిజిస్ట్రేషన్
- పేదలను నగరానికి దూరం చేయం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 29 :** పేదవాడి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, జీవితకాలపు సొంతింటి కలను ఏడాదిలోనే సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదల కష్టాలు, వారి అవసరాలను అర్థం చేసుకున్న ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత విలువైన ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను కేవలం ఆదాయ మిగతా2లో...

## నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. భారీ బహిరంగ సభలో ప్రసంగం



2లో

## ఎన్‌సీపీసీఆర్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

- ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఆర్‌టీఈ కోటా అమలుపై ఆగ్రహం



2లో



## రాష్ట్ర ప్రభుత్వానిది తుగ్లక్ నిర్ణయం

- సింగరేణి బొగ్గు టన్నుకు రూ.3,800.. విదేశీ బొగ్గుకు రూ.9 వేల ఖర్చు
- ప్రజలపై ఈ అదనపు భారాన్ని ఎందుకు మోపుతున్నారు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 29:** టన్నుకు రూ. 3,800 ఖర్చయ్యే సింగరేణి బొగ్గును వినియోగించకుండా, టన్నుకు రూ. 9 వేల వరకు ఖర్చయ్యే విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం మరో 'తుగ్లక్' నిర్ణయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ నిర్ణయం ఎవరి ప్రయోజనం కోసం తీసుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మిగతా2లో...




## నాతో పెట్టుకోవద్దు

- కేటీఆర్ వ్యాఖ్యలపై కవిత తీవ్ర ఆగ్రహం

**తొలి అక్షరం/హైదరాబాద్, 29:** తాను ఏ విషయమైనా నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతానని, తనతో పెట్టుకోవద్దని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తాను ఎవరి మాటలు విని ఏది పడితే అది మాట్లాడబోనని స్పష్టం చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో స్పందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణమన్న మిగతా2లో...

# తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29:** తుమ్మిడి హట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ం152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల)తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలో సొంతింటి కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)

వనరులుగా చూడకుండా పేదల ఆవాసాల కోసం వినియోగిస్తున్నామని తెలిపారు.నాంపల్లి నియోజకవర్గ పరిధిలోని రెడ్‌హిల్స్‌లో మంగళవారం 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఎకరం భూమి రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణానికి స్థలాలను కేటాయిస్తున్నామని చెప్పారు.రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఒక్కో అపార్ట్‌మెంట్ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు విలువ ఉంటుందని మంత్రి తెలిపారు. నిర్మాణ పనులను ఏళ్ల తరబడి కొనసాగించకుండా ఏడాది వ్యవధిలోనే పూర్తి చేసి, ఇదే వేదిక నుంచి లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్ నగర పరిధిలోని 20 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అనువైన భూములను గుర్తించినట్లు, ఇప్పటికే 16 నుంచి 17 ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు.మొదటి విడతలో పారదర్శకంగా నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి వివరించారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు రెండో, మూడో, నాలుగో విడతల్లో ఇళ్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. పేదలకు కేవలం కాగితాలపై హామీలు ఇచ్చి వదిలేయకుండా, ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.లబ్ధిదారుల నుంచి ఎలాంటి పైరవీలు, కమిషన్లు లేకుండా ప్రభుత్వ ఖర్చుతోనే ఇళ్లను వారి పేర్లపై పక్కాగా రిజిస్ట్రేషన్ చేయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పిల్లల ఉన్నత విద్య, వివాహాలు, అత్యవసర వైద్య ఖర్చులు వంటి అవసరాలకు ఇంటిని ఆధారంగా చూపించి బ్యాంకుల నుంచి రుణం పొందే హక్కును కూడా పేదలకు కల్పిస్తున్నామని తెలిపారు.**నగరానికి దూరంగా ఇళ్లు నిర్మించం** గత ప్రభుత్వాల హయాంలో పేదల కోసం నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల వారి జీవనోపాధి, రోజువారీ పనులు, పిల్లల విద్యకు ఇబ్బందులు ఏర్పడ్డాయని మంత్రి పొంగులేటి విమర్శించారు. పేదల జీవన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వారు నివసించే ప్రాంతాలకు సమీపంలోనే జీ+10 విధానంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు.ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నిర్మాణ పనులను లబ్ధిదారులు వారానికి ఒకసారి స్వయంగా పరిశీలించే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. తద్వారా నిర్మాణ నాణ్యతను వారు కూడా పర్యవేక్షించవచ్చని పేర్కొన్నారు. రెడ్‌హిల్స్ ప్రాంతంలో భవిష్యత్తులో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా నిర్మాణ ప్రాంతంలోని డ్రైనేజీ వ్యవస్థను ప్రధాన ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను గృహనిర్మాణ శాఖ తీసుకుంటుందని తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వానిది తుగ్లక్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

విదేశీ బొగ్గు దిగుమతికి అయ్యే అదనపు భారాన్ని తెలంగాణ ప్రజలు ఎందుకు భరించాలని ఆయన నిలదీశారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు.తెలంగాణలో భారీగా బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని సింగరేణి సంస్థను పక్కనపెట్టి విదేశాల నుంచి అధిక ధరకు బొగ్గును దిగుమతి చేసుకోవడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలోనే తెలంగాణలో అత్యధిక బొగ్గు నిల్వలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అవసరాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు కూడా సింగరేణి సంస్థ బొగ్గును సరఫరా చేస్తోందని తెలిపారు. అలాంటి సంస్థ అందుబాటులో ఉండగా విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు.సింగరేణి బొగ్గును వినియోగించడం వల్ల రాష్ట్రానికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవచ్చని కేటీఆర్ పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో లభించే సింగరేణి బొగ్గును ఉపయోగించకుండా, దాదాపు రెండింతలకు పైగా ధర చెల్లించి విదేశీ బొగ్గును కొనుగోలు చేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అదనపు వ్యయం చివరకు ప్రజలపై భారం పడే పరిస్థితి ఎందుకు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గును ఉపయోగించి టీఎస్ జెన్‌కో ద్వారా 24 గంటల విద్యుత్ సరఫరా అందించామని కేటీఆర్ తన ప్రకటనలో గుర్తు చేశారు. సింగరేణి నుంచి బొగ్గు అందుబాటులో ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తికి విదేశీ బొగ్గుపై ఆధారపడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. గతంలో సాధ్యమైన విద్యుత్ సరఫరా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎందుకు సాధ్యం కావడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను వినియోగించుకుంటూ విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా విదేశీ బొగ్గు దిగుమతులకు అనుమతించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలుగుతుందని ఆయన ఆరోపించారు. తక్కువ ధరకు అందుబాటులో ఉన్న బొగ్గును వదిలి ఎక్కువ ధరకు విదేశీ బొగ్గును కొనుగోలు చేయడంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.విదేశీ బొగ్గు దిగుమతుల వల్ల ఏర్పడే అదనపు ఆర్థిక భారాన్ని ప్రభుత్వం ఎలా భరిస్తుందో, దాని ప్రభావం విద్యుత్ వినియోగదారులపై పడుతుందా లేదా అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. రాష్ట్రంలోని బొగ్గు వనరులు, సింగరేణి సంస్థ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# ఎన్‌సీపీసీఆర్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29:** ప్రైవేటు పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు ఉద్దేశించిన 25 శాతం ఆర్‌టీఈ కోటా అమలుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కోటా అమలుకు సంబంధించిన వివరాలను సమర్పించే విషయంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) వ్యవహరించిన తీరుపై ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తింది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు, ఎయిడెడ్ కాని పొరుగు పాఠశాలలు ప్రవేశ స్థాయిలో కనీసం 25 శాతం సీట్లను బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించి ఉచిత ప్రాథమిక విద్య అందించాలి. ఈ నిబంధన సమర్థంగా అమలవుతున్న తీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది.

ఈ కేసు విచారణ సందర్భంగా ఎన్‌సీపీసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కేవలం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సమాచారాన్ని సేకరించడం మాత్రమే ఎన్‌సీపీసీఆర్ బాధ్యత కాదని, ప్రతి పొరుగు పాఠశాలలో ఆర్‌టీఈ నిబంధన అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని కోర్టు స్పష్టం చేసింది.ఎన్‌సీపీసీఆర్ తన అఫిడవిట్‌లో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాసి ఆర్‌టీఈ చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) అమలుకు సంబంధించిన నిబం ధనల వివరాలను కోరినట్లు తెలిపింది.

అయితే తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఇంకా స్పందన రాలేదని వెల్లడించింది. మిగిలిన ప్రాంతాలు అమలు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. అయితే సమాచార సేకరణతో ప్రక్రియను ముగించకుండా, చట్టం ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకురా వాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ అంశంపై తదుపరి విచారణకు ఎన్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్, డైరెక్టర్ హాజరుకావాలని ధర్మాసనం ఆదేశించింది. ఇది ధిక్కరణ కేసు కాదని, కమిషన్‌కు అప్పగించిన బాధ్యతపై స్పష్టత కల్పించేందుకే హాజరు కావాలని కోర్టు పేర్కొంది.2026 జనవరిలోనే సుప్రీంకోర్టు ఆర్‌టీఈ చట్టంలోని 25 శాతం కోటాను సమర్థంగా అమలు చేసేందుకు అవసరమైన నియమ నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం జాతీయ స్థాయి బాధ్యతగా పేర్కొంది.

## అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా...

**నోరు అదుపులో పెట్టుకోకపోతే ఊరుకోబోం**

**కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలి**

**ప్రత్యర్థులకు కొండా సురేఖ హెచ్చరికలు**

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 29 :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహిం చిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడు తూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు. కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

# మయన్మార్‌లో వైమానిక దాడి..

(మొదటి పేజీ తరువాయి)

ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఆ మార్కెట్ రాష్ట్రంలోని ప్రధాన టోకు వ్యాపార కేంద్రాలలో ఒకటి, ఇది వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులను, వినియోగదారులను ఆకర్షిస్తుంది. తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను ఒక తీవ్రమైన వైమానిక దాడిగా పేర్కొంటూ, బాధ్యులైన పక్షాలు, సంస్థలపై సమర్థవంతమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని అరాకన్ ఆర్మీ హెచ్చరించింది. దాడి తర్వాత సోషల్ మీడియాలో విడుదలైన ఫోటోలు, వీడియోలలో కొన్ని భవనాలు తగలబడుతుండటం, వాహనాలు దెబ్బతినడం, సమీపంలోని వంతెనలో కొంత భాగం ధ్వంసం కావడం కనిపించింది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం ఇంకా స్పందించలేదు. అయితే, తాము కేవలం చట్టబద్ధమైన సైనిక నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకుంటామని సైన్యం గతంలో పేర్కొంది. తిరుగుబాటు గ్రూపులు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. మయన్మార్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన సుమారు 340 కిలోమీటర్ల దూరంలో క్యౌక్తావ్ ఉంది. ఈ ప్రాంతం ప్రస్తుతం అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉందని చెబుతున్నారు.

# నాతో పెట్టుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ వ్యాఖ్యలను కవిత తప్పుబట్టారు. అహంకారం, అక్రమ దందాలతోనే పార్టీని పాతాళానికి నెట్టారని కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు.తాను పార్టీలోని ఓ నేతపై అవినీతి ఆరోపణలు చేస్తే కొన్ని గంటల్లోనే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అదే వ్యక్తితో కలిసి ఉంటూ పార్టీ అధినేత నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ఆమె ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించిన ఫామ్‌హౌస్‌లు, అనుమతులు, ఇతర వ్యవహారాలను ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై విమర్శలు చేశారు.పార్టీలో జరిగిన వైఫల్యాలను అధినేత కేసీఆర్‌పై మోపడం సరికాదని కవిత అన్నారు. కేటీఆర్ మైండ్‌గేమ్‌ను నమ్ముతూ పార్టీకి నష్టం కలిగించవద్దని హెచ్చరించారు. గతంలో ప్రజలు, రైతులు ఎదుర్కొన్న సందర్భాలను ప్రస్తావిస్తూ కేటీఆర్ వ్యవహారశైలిపై ఆమె విమర్శలు చేశారు.

# నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి

**• పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..**

**భారీ బహిరంగ సభలో ప్రసంగం**

**తొలి అక్షరం/సిరిసిల్ల,సెప్టెంబర్ 29:**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు తొలిసారి వస్తున్న ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, వివిధ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం రగుడు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తొలుత కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించి, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం సిరిసిల్లకు చేరుకోనున్న సీఎం రేవంత్‌రెడ్డి అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు.రగుడు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు.సిరిసిల్ల పర్యటనలో సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు ఇతర నివేదికలు పేర్కొన్నాయి. నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు ఇందులో ఉన్నాయి.

# ఖర్గే పాల్గొన్న వేదికను శుద్ధి చేయడం దారుణం

(మొదటి పేజీ తరువాయి)

దళితుల రక్షణ కోసం అమల్లోకి వచ్చిన అట్రాసిటీ చట్టాన్ని ఆయన ప్రస్తావించారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్‌లో పాల్గొన్న కార్యక్రమం అనంతరం వేదికను శుద్ధి చేశారన్న అంశంపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. ఖర్గే అంచెలంచెలుగా ఎదిగి సీఎల్పీ నేతగా, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా, ప్రస్తుతం ఏఐసీసీ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఖర్గే పాల్గొన్న వేదికను అనంతరం శుద్ధి చేయడం దారుణమని విమర్శించారు.దళితులను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారనే భావన కలుగుతోందని భట్టి ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ రక్షణ, సమానత్వం కల్పించేందుకు దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్‌లో ఖర్గే సమావేశం అనంతరం జరిగిన పరిణామాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్పందించకపోవడం ప్రశ్నలకు తావిస్తోందని అన్నారు. దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కులు, సమానత్వం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు.

# తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

**తొలి అక్షరం/ఫ్రాంక్‌ఫర్ట్, సెప్టెంబర్ 29:** జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు.. ఈ బృందానికి అక్కడి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రంలో ఇన్వెస్టర్స్ కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రవాస తెలంగాణ వాసులు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తీసుకురావడంలో గొప్ప వారధిగా నిలవాలని స్పీకర్ ప్రసాద్ సూచించారు.

కార్యక్రమంలో భాగంగా 2024లో జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్ర స్పీకర్ హెంద్రిక్ హెరింగ్ బృందం హైదరాబాద్‌లోని అసెంబ్లీని సందర్శించింది. ఇప్పుడు దానికి రిటర్న్ విజిట్‌గా తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటిస్తోంది. యూరప్ లోని జర్మనీ తర్వాత ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ లో ఈ బృందం పర్యటించనుంది. వచ్చే నెల 9వ తేదీన శాసన సభ స్పీకర్ గారు, శాసన మండలి చైర్మన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తిరిగి హైదరాబాద్ కు చేరుకుంటుంది. సెప్టెంబర్ 13 నుంచి 18వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ జరిగింది. కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ కు కొనసాగింపుగా విదేశీ పర్యటనకు ఈ బృందం వెళ్లింది. విదేశీ పర్యటనలో భాగంగా రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధి బృందం ఆయా దేశాల పార్లమెంట్లను సందర్శించి, అక్కడి పార్లమెంటరీ విధానాలను పరిశీలిస్తుంది.

# నవ కంటోన్మెంట్ నిర్మాణమే ధ్యేయం

● బస్తీల్లో పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్ ● పికెట్, శ్రీరామ్‌నగర్,సంతోషిమాత టెంపుల్ ఏరియాల్లో సమస్యల పరిశీలన ● రూ.338 కోట్ల నిధులతో మౌలిక వసతుల కల్పన ● తాగునీటిని పొదుపుగా వాడాలని పిలుపు





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు), సెప్టెంబర్29:** కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి నవ కంటోన్మెంట్ గా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు.స్థానిక ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో స్వయంగా తెలుసుకునేందుకు ఆయన వార్డు-4 పరిధిలోని పికెట్ హరిజన బస్తి,శ్రీరామ్‌నగర్, సంతోషిమాత టెంపుల్ బస్తీల్లో విస్తృతంగా పర్యటించారు.వీధి వీధినా తిరుగుతూ స్థానికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు సీవరేజ్ నెట్‌వర్క్,విద్యుత్ సమస్యలు,తాగునీటి సరఫరాలో అంతరాయం,ధ్వంసమైన రోడ్ల నిర్మాణం వంటి పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించిన ఆయన వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. **రూ.338 కోట్లు అందుబాటులో ఉన్నాయి:** ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూముల బదలాయింపు ద్వారా రూ.338 కోట్ల నిధులు వచ్చాయని ఈ నిధులను నియోజకవర్గంలో రోడ్లు,డ్రైనేజీ,మంచినీటి వంటి మౌలిక వసతుల మెరుగుదలకు వినియోగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధుల వినియోగం మరియు పెండింగ్ పనుల వేగవంతంపై ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు సంబంధిత శాఖ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు అధికారులతో చర్చించానని చెప్పారు.అందరూ సానుకూలంగా స్పందించారని త్వరలోనే అన్ని అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. **నీటి కొరత ఉంది.. పొదుపుగా వాడండి:** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా పడక నియోజకవర్గంలో నీటి కొరత తీవ్రమైందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితుల్లో ప్రజలందరూ తాగునీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం మీ మధ్యే, క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉంటా అని శ్రీగణేష్ పునరుద్ఘాటించారు.ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, బస్తీవాసులు,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఈ నెల 1న జాబ్ మేళా..: జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 29:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు అక్టోబర్ 1 న (గురువారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళా స్థానిక టీటీడీసీ (హవేలీ రెస్టారెంట్ ఎదురుగా) లో చేపడుతున్నట్లు అన్నారు. ఫ్లిప్కార్ట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ & డెలివరీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ఖాళీలు 20 వున్నట్లు, విద్యార్హత ఎస్సెస్సి (పదో తరగతి) ఉత్తీర్ణత లేదా ఆపైన ఉండాలని, వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉన్న పురుషులు/మహిళలు అర్హులని, జీతం నెలకు 17,000 రూపాయలు + ఇన్సెంటివ్‌లు ఇవ్వబడతాయని ఉపాధి అధికారిణి అన్నారు. అభ్యర్థులకు తప్పనిసరిగా ద్విచక్ర వాహనం (బైక్) ఉండాలని, ఖాళీలు ఖమ్మంలోనే ఉంటాయని, అర్హత, ఆసక్తి ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యా అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో అక్టోబర్ 1 న (గురువారం) ఉదయం 10.00 గంటలకు టీటీడీసీ వద్ద జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా గుడిపూడి జగదీష్

● అనారోగ్య బాధిత కుటుంబానికి

రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 29:** రాజకీయాలు కేవలం పదవుల కోసం కాదని.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారి పక్కన నిలబడి అండగా నిలవడమే నిజమైన ప్రజా సేవ అని ఖమ్మం కార్పొరేషన్ 44వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు గుడిపూడి జగదీష్ చాటిచెప్పారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సరాబు అనంతరామారావు కుటుంబాన్ని పరామర్శించిన గుడిపూడి జగదీష్, మైనారిటీ నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి రూ.60,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆపద సమయంలో ఆర్థిక భారం మోయలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిన ఈ సహాయం కొంత ఊరటనిచ్చింది. ప్రజల సమస్యలను కేవలం మాటల్లో కాకుండా చేతల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని గుడిపూడి జగదీష్ తెలిపారు."కష్టాల్లో ఉన్న ప్రజల ఇంటి తలుపు తట్టడమే మా రాజకీయానికి అర్థం"ప్రజల బాధను పట్టించుకోకుండా రాజకీయాలు చేసే రోజులు పోయాయని, ప్రజల కష్టాల్లో భాగస్వాములై వారికి అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గుడిపూడి జగదీష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందేలా సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, గుడిపూడి జగదీష్‌కు సరాబు అనంతరామారావు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రజల కష్టాల్లో ముందుండి.. సంక్షేమంలో భాగస్వామిగా..44వ డివిజన్‌లో ప్రజా సేవే లక్ష్యంగా గుడిపూడి జగదీష్ ముందుకు సాగుతున్నారు.

# శిథిల భవనంలో చిన్నారుల చదువులు!

పెచ్చులూడుతున్న పైకప్పు..

వర్షాకాలంలో మరింత ప్రమాదం

మరమ్మతులు చేపట్టాలని

తల్లిదండ్రులు, గ్రామస్థుల డిమాండ్




**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 29:** బడి అంటే చిన్నారుల భవిష్యత్తుకు తొలి మెట్టు. అలాంటి పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయాందోళనల మధ్య చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం ఏళ్లుగా సరైన మరమ్మతులకు నోచుకోక క్రమంగా బలహీనపడుతోంది. **పెచ్చులూడుతున్న పైకప్పు** పాఠశాల తరగతి గదుల పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. గోడలు, పైకప్పుపై తేమ పేరుకుపోవడంతో పలుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయని తెలిపారు. దీంతో తరగతుల్లో చదువుకునే చిన్నారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారడం, తేమ పెరగడం వల్ల భవనం మరింత బలహీనపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. **ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?** పాఠశాల భవనం పరిస్థితిని అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి రాకూడదని, ముందుగానే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భవనం పటిష్టతపై సాంకేతిక పరిశీలన నిర్వహించి అవసరమైన మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.భవనం సురక్షితంగా లేదని అధికారులు నిర్ధారిస్తే విద్యార్థుల కోసం తాత్కాలిక తరగతి గదులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పబ్బు రాజు గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ

- పబ్బు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 29:** చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ తల్లి పబ్బు వజ్రమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మల్కాపురంలోని పబ్బు రాజు గౌడ్ స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా పబ్బు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పబ్బు రాజు గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వజ్రమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్, ఆంధోల్ మైసమ్మ దేవాలయ చైర్మన్ కంచర్ల అశ్విని రెడ్డి, కౌన్సిలర్ బద్రి గాలయ్య, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, వార్డు సభ్యులు పక్కిరు వంశీధర్ రెడ్డి, ఇంద్రసేన రెడ్డి, దొనకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మల్కంబ్‌లో మెరిసిన చిన్నారుల ప్రతిభ!

ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఘనం.. రాష్ట్ర స్థాయికి 24 మంది ఎంపిక





**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 29:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-14, అండర్-17 బాలబాలికల మల్కంబ్ ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతిభ ఆధారంగా 24 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. **అండర్-14 బాలికలు:** ఎన్. వైష్ణవి, ఎం. మేఘన, పి. హారిణి, కె. కావ్య శ్రీ, చ. హర్షిత, ఎన్. నిత్య శ్రీ. **అండర్-14 బాలురు:** బి. చరణ్, వేదమానస్, డి. యశ్వంత్, చ. విఘ్నేష్, చ. సంజయ్ కుమార్, బి. ఆదిత్య. **అండర్-17 బాలురు:** చ. దీక్షిత్, యు. రాధే శ్యామ్, పి. శశాంక్, జి. చిద్విలాస్, కె. కరణ్, ఎ. సాయికార్తిక్. **అండర్-17 బాలికలు:** ఎ. ఆకాంక్ష, ఎన్. మోక్షిత, కె. కృతిక, ఎ. వైష్ణవి, ఎస్. సహితి, జి. ప్రణవి. ఈ సందర్భంగా మండల ఎంఈఓ గురువారావు మాట్లాడుతూ మల్కంబ్ క్రీడ విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, సమతుల్యత, ఏకాగ్రత, చురుకుదనం, క్రమశిక్షణను పెంపొందిస్తుందని తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి లింగయ్య, ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. గోపాల్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

# కాంగ్రెస్ ఆరోపణలు పచ్చి అబద్ధం: నకిరేకంటి మొగులయ్య



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 29:** రామన్నపేటలో నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య మాట్లాడుతూ, ఎన్నికల ప్రధాన కమిషనర్ పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధమని, అవి ఇండియన్ ఎక్స్ ప్రెస్ ఫేక్ కథనం ఆధారంగా చేస్తున్న నీచ రాజకీయమని ఖండించారు.క్యాబినెట్ సెక్రటరీ భేటీ సాధారణ పరిపాలనా ప్రక్రియేనని, నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయని, ఫామ్-6 రాజ్యాంగబద్ధమని సుప్రీంకోర్టు 2006లోనే తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఓటమిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ ఓట్ చోరీ అంటూ ప్రజలను మభ్యపెడుతోందని, ఇలాంటి రాజకీయాలు మానుకోకుంటే కాంగ్రెస్ దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తామని హెచ్చరించారు.పాల్గొన్నవారుబండ మధుకర్ రెడ్డి, వనం అంజయ్య, జంగిలి సత్యనారాయణ, సుర్వి హరిబాబు, బట్టే రమేష్, నకిరేకంటి రవి, గురుకు సైదులు తదితరులు.

# రామన్నపేటలో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 29:** రామన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న ఎరువుల దుకాణాల్లో అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.రామన్నపేట వ్యవసాయ అధికారి ఏజాజ్ అలీ ఖాన్, రామన్నపేట మండల పరిశీలన అధికారిగా ఉన్న బీబీనగర్ ఏవో సిహెచ్. పద్మతో కలిసి మండలంలోని పలు ఎరువుల షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, ఎరువుల నిల్వలు, ధరల పట్టికను పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, నకిలీ ఎరువులు విక్రయించే డీలర్లపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి రైతు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా డీలర్ నుండి బిల్లు, రశీదు తీసుకోవాలని, నకిలీ ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యత లేని ఎరువులు, అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ తనిఖీల్లో పలువురు డీలర్లు, రైతులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ తెస్తానన్న మార్పు ఇదేనా?

- యూరియా కోసం రైతుల క్యూలైన్లు.ఆగిన పంట కొనుగోళ్లు.
- అప్రకటిత విద్యుత్ కోతలు.రైతు బీమాపై అనిశ్చితి
- అన్నదాతను ఆగమాగం చేస్తున్న కాంగ్రెస్ పాలన
- ఢిల్లీ మాధవరెడ్డి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, చౌటుప్పల్ మండలం



**తొలి అక్షరం/చౌటుప్పల్:సెప్టెంబర్ 29:** 'మార్పు తీసుకొస్తాం' అంటూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని చౌటుప్పల్ మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి ఆరోపించారు. యూరియా బస్తా కోసం రైతులు క్యూలైన్లలో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పంట కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆయన అన్నారు.రైతు బీమా పథకం నిలిచిపోయిందని, వ్యవసాయానికి అవసరమైన సమయంలో భారీగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. దీంతో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో కనిపించిన పంట విరామ పరిస్థితులు మళ్లీ మొదలయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులకు పొంతన లేదని ఢిల్లీ మాధవరెడ్డి విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచడంతో పాటు, పంట కొనుగోళ్లను వేగవంతం చేయాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**- పెండింగ్ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ శ్రీజ**



**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 29:** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం2010ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి, వైద్య సంస్థలు నిర్దేశిత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించి చట్టం అమలు, రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, తనిఖీలపై సమీక్షించారు.జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను వచ్చే నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సమయంలో నిబంధనలు, కనీస ప్రమాణాలు, అవసరమైన అనుమతులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఆసుపత్రుల్లో పార్కింగ్ సౌకర్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 10 పడకల లోపు నర్సింగ్ హోమ్‌ల విషయంలో నిబంధనలకు అనుగుణంగా వర్గీకరణ చేపట్టాలని తెలిపారు. **దయాగ్నస్టిక్ కేంద్రాలపై చర్యలు** జిల్లాలో ఇప్పటికే 16 దయాగ్నస్టిక్ కేంద్రాలను తనిఖీ చేయగా పలు లోపాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత గడువులో లోపాలను సరిదిద్దుకునేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. గడువు అనంతరం కూడా నిబంధనలు పాటించని సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జూలై 27 నుంచి ఇప్పటి వరకు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌కు 29 దరఖాస్తులు రాగా, 20 సర్టిఫికెట్లు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు 52 దరఖాస్తులు రాగా, 16 ప్రక్రియలో ఉన్నాయని, 24 దరఖాస్తులను ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు వివరించారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డీఎంహెచ్ఓ డా. రామారావు, డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. నరేందర్, కమిటీ సభ్యులు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

# విద్యాసేవలో ఉపాధ్యాయుడి గుర్తింపు- పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**తొలి అక్షరం :వలిగొండ, సెప్టెంబర్ 29:** యాదాద్రి భువనగిరి జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో విద్య సేవ రత్న అవార్డు-2026కు పవిత్రాత్మ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జెనీఫర్,తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్.పాండు ను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆదివారం సన్మానించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ సవిత అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్లను గుర్తించి ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ట్రస్మా వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం భువనగిరి వైయస్సార్ గార్డెన్లో అస్మిత ఊషు లీగ్ పోటీలు నిర్వహించగా పాఠశాల నుండి 23మంది విద్యార్థులు పాల్గొనగా నలుగురికి గోల్డ్ మెడల్స్,ముగ్గురికి సిల్వర్ మెడల్స్,16 మంది విద్యార్థులకు బ్రోంజ్ మెడల్స్ తోపాటు ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ ముందు ముందు జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లి అనేక బహుమతులు పొందాలని సూచించారు.మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్స్ కు ఎంపికైన విద్యార్థి హేమంత్ సాయిని అభినందించారు.ఈ కార్యక్రమంలో సిస్టర్ సంగీత,సిస్టర్ శైల,మాస్టర్స్ రాజు,మాస్టర్ సిద్ధార్థ,వ్యాయామ ఉపాధ్యాయులు పరుశు రాం,ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ క్లాస్ మిత్రుల సహకారం



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్29:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన చిన్ననాటి స్నేహానికి వయసుతో సంబంధం లేదని 20022003 టెన్త్ క్లాస్ మిత్ర బృందం నిరూపించింది. చదువుకున్న రోజుల్లో కలిసి మెలిసి తిరిగిన బాల్య మిత్రులు, రెండు దశాబ్దాలు గడిచినా అదే ఆప్యాయతతో ఒకరికొకరు అండగా నిలిచారు. మిత్రుడు బత్తుల శ్రీకాంత్ జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో 20022003 టెన్త్ క్లాస్ మిత్ర బృందం సుమారు రూ.35 వేల ఆర్థిక సహకారంతో స్వీట్ అండ్ మిక్చర్ బండి వ్యాపారాన్ని ప్రారంభించింది.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక బండి మాత్రమే కాదని, తమ స్నేహానికి గుర్తుగా, ఐక్యతకు చిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. కష్టకాలంలో మిత్రుడికి అండగా నిలిచి, స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడం ఆనందంగా ఉందన్నారు. బత్తుల శ్రీకాంత్ ప్రారంభించిన వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని, ఆయన ఆర్థికంగా స్థిరపడాలని మిత్రులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు నీలకంఠం లింగస్వామి, సాగర్ల నాగరాజు, గుండెపురి లింగస్వామి, చేకూరి గణేష్, గుత్తా కుశల్ కుమార్ రెడ్డి, ఎడ్ల రాములు, ఏర్పుల పరమేష్, గుండెపురి శేఖర్, గుండెపురి కృష్ణతో పాటు పలువురు మిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మునిపంపులలో అంగన్‌వాడీ టీచర్ల ఘన సన్మానం





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 29:** భారత ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మునిపంపుల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు.జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏలూరి అనిత, యధాసు శోభ, బాదే మంజుల ను సన్మానించారు. ముఖ్యఅతిథిగా మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, సమాజ ఆరోగ్యానికి, పిల్లలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్ల పాత్ర మరువలేనిదని కొనియాడారు.పాల్గొన్నవారు: రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, సీనియర్ నాయకులు మన్నెం పద్మా రెడ్డి, గోపగోని ధర్మరాజు, మండల ఉపాధ్యక్షులు బట్టే రమేష్ తదితరులు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు ప్రాధాన్యత

**- కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించాలి: అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**




**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 29:** ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నాణ్యత, రవాణా, నిల్వ, మౌలిక వసతులపై సమీక్షించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోని గోదాములు, గుర్తించిన ఫంక్షన్ హాళ్లు లేదా రైస్ మిల్లుల్లోని ఖాళీ ప్రదేశాలకు తరలించాలని సూచించారు. రవాణా చేసే ప్రతి లారీ, ట్రాక్టర్‌కు జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఏర్పాటు చేసి ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు. బ్యాంకు గ్యారంటీలు చెల్లించి, పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీ పూర్తి చేసిన రైస్ మిల్లులకే ధాన్యం కేటాయింపులు ఉంటాయని చెప్పారు. **ఏడు సన్నరకాలకే రూ.500 ప్రోత్సాహకం** ప్రభుత్వం గుర్తించిన బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాల ధాన్యానికే క్వింటాకు రూ.500 అదనపు ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. గ్రేడ్-'ఏ' ధాన్యానికి క్వింటాకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 ధర ఉండగా, గుర్తించిన సన్నరకానికి ప్రోత్సాహకంతో కలిపి రూ.2,961 లభిస్తుందని పేర్కొన్నారు. **అక్టోబర్ 1 నుంచి 325 కొనుగోలు కేంద్రాలు** జిల్లాలో అక్టోబర్ 1 నుంచి 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో సన్న, సాధారణ రకాలకు ప్రత్యేక ప్రదేశాలు ఏర్పాటు చేయాలని, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, ప్యాడీ క్లీనర్లు తదితర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని స్పష్టం చేశారు.ధాన్యంలో తేమ శాతం గరిష్టంగా 17 శాతం ఉండాలని, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్లు, ట్యాబ్ ఎంట్రీలను పక్కాగా నిర్వహించాలని సూచించారు.సమావేశంలో లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాదరావు, పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డీసీఓ గంగాధర్, డీఎం సివిల్ సప్లయిస్ మల్లికార్జున్, వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆపద్బాంధవుడు

- రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడిని స్వయంగా ఆస్పత్రికి తరలించిన డీసీహెచ్ఎస్



**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 29:** రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి ఖమ్మం డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తక్షణ సహాయం అందించారు. విధులు ముగించుకుని వెళ్తున్న ఆయన కలెక్టరేట్ సమీపంలో ప్రమాదాన్ని గమనించి తన వాహనాన్ని ఆపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అభిషేక్ అనే యువకుడు వాటర్ క్యాన్లతో వెళ్తున్న ఆటో ట్రాలీ ప్రమాదానికి గురై రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు.ప్రమాదాన్ని గమనించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ వెంటనే పరిస్థితిని తెలుసుకుని, అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో గాయపడిన యువకుడిని తన కారులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పరీక్షల్లో అభిషేక్ కుడి తొడ భాగంలో గాయం ఉన్నట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందించారు.విధులకే పరిమితం కాకుండా ఆపదలో ఉన్న అపరిచితుడికి సకాలంలో సహాయం అందించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్‌ను స్థానికులు అభినందించారు. వైద్యుడిగా తన బాధ్యతను మానవత్వంతో చాటుకున్న ఆయన సేవాభావం పలువురి ప్రశంసలు అందుకుంది.

# చదరంగ పోటీల్లో మెరిసిన ఇండియన్ హైట్స్ విద్యార్థి

**శ్రీకర్ ఘనత.. ఇండియన్ హైట్స్ పాఠశాలలో అభినందనల వెల్లువ**

**అండర్14 చెస్‌లో శ్రీకర్ మెరుపు..**

**ఇండియన్ హైట్స్‌లో ఘన సన్మానం**

**ఇండియన్ హైట్స్ పాఠశాల చైర్మన్ సజ్జల భువనేశ్వర్**




**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 29:** షాద్‌నగర్ ఇండియన్ హైట్స్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం. శ్రీకర్ చదరంగ పోటీల్లో సత్తా చాటాడు. షాద్‌నగర్ పట్టణంలోని పతంజలి యోగా సెంటర్‌లో షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్ 2026లో అండర్14 విభాగంలో తృతీయ స్థానం సాధించాడు. అద్భుత ప్రతిభ కనబరిచి ట్రోఫీని కైవసం చేసుకున్న శ్రీకర్.. పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు.శ్రీకర్ విజయాన్ని పురస్కరించుకుని ఇండియన్ హైట్స్ పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది. పాఠశాల చైర్మన్ సజ్జల భువనేశ్వర్, వైస్ చైర్మన్ ద్రాక్షాయణి, డైరెక్టర్లు మహేష్, విశ్వేశ్వర్, జగదీశ్వర్, ప్రిన్సిపల్ సునీత కలిసి శ్రీకర్‌కు ట్రోఫీ, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. విద్యార్థికి శిక్షణ అందించిన చెస్ మాస్టర్ వానరాసి జగన్‌ను కూడా సత్కరించారు. చైర్మన్ సజ్జల భువనేశ్వర్ మాట్లాడుతూ.. చదరంగం విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, క్రీడాస్ఫూర్తిని పెంపొంది స్తుందని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. శ్రీకర్‌ను ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా క్రీడల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖర్బూజా తోటను పరిశీలించిన ఏరువాకా శాస్త్రవేత్తలు



**తొలి అక్షరం/లింగాల సెప్టెంబర్ 29:-** మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామంలో మంగళవారం కడప ఏరువాక,వ్యవసాయ పరిశోధనా స్థానం (ఏఆర్యస్) శాస్త్రవేత్తలు ఖర్బూజా తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంట సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డా. పి. మాధురి, డా. వి. శ్రీవల్లి, డా. ఎస్. మానస, డా. ఎస్. ఫిరోజ్ హుస్సేన్, వ్యవసాయ అధికారి రమేష్ నాయక్, ఉద్యానవన అధికారి దీప, గ్రామ ఉద్యానవన సహాయకులు యువతేజ మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు డిప్యూటీ ఎంపీడీవో ఎ.ఎస్.వెంకటరమణ.పదవీ విరమణ

### - పాఠశాల క్లార్క్ నుంచి డిప్యూటీ ఎంపిడివో ఎదిగిన ఎ.ఎస్.వెంకటరమణ



**తొలి అక్షరం/బొమ్మనహాల్ సెప్టెంబర్ 29:-** బొమ్మనహాల్ మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎ.ఎస్. వెంకటరమణ బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు,ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలకు చేసిన సేవలను స్మరించుకుంటూ మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు,ఎ.ఎస్ వెంకటరమణ తన ఉద్యోగ జీవితం మొదటిగా పాఠశాల క్లార్క్ స్థాయి నుంచి డిప్యూటీ ఎంపిడివో స్థాయి వరకు బాధ్యతలను సమర్థవంతంగా అధికారులతో మరియు ప్రజాప్రతినిధులు,సిబ్బందితో సమన్వయంతో పనిచేశారని సహచరులు పేర్కొన్నారు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో తనవంతు పాత్ర పోషించారని తెలిపారు,ఈ సందర్భంగా నిర్వహించే సన్మాన కార్యక్రమానికి మండల ఎంపీపీ మండల నాయకులు మండల స్థాయి అధికారులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై,మండల డిప్యూటీ ఎంపీడీవో ఏ.ఎస్ వెంకటరమణ సభను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## కడపలో బలిజ సంఘం అధ్యక్షుడి వాహనం ధ్వంసం



**తొలి అక్షరం/కడప సెప్టెంబర్ 29:-** కడప నగరంలో కడప జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్ కు చెందిన వాహనంపై నిన్న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ వి.ఎస్. అమీర్ బాబు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ అలంకానిపల్లె లక్ష్మీరెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నా రు. బాధితుడికి ధైర్యం చెప్పి, దోషులపై కఠిన చర్యలు తీసుకో వాలని పోలీసులను కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు, బలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారులకు సన్మానం

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 29:** గణేష్ ఉత్సవాలు, నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించిన నారాయణగూడ పోలీసు అధికారులను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సీఐ సైదేశ్వర్, ఎస్ఐలు నాగేష్, శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు, శ్రావణి, సాయి సందీప్‌లకు శాలువాలు కప్పి సత్కరించారు. సమితి నాయకులు కొయ్యాడ నర్సింగ్ గౌడ్, గోపిశెట్టి ప్రమోద్, గోపి, ధీరేందర్ బియానీ, మల్లికార్జున్, మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన ఎదుగుదల

### - బీరసాగర్ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



**తొలి అక్షరం/మహాదేవపూర్ సెప్టెంబర్ 29:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని బీరసాగర్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ రాధికా రెడ్డి, సూపర్వైజర్ స్పందన ఆదేశాల మేరకు అంగన్వాడీ టీచర్ రజిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను నిర్వహించి, వాటిలో లభించే పోషక విలువలను తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. పోషకాహారం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## లోతుకుంట అంగన్వాడి కేంద్రంలో జాతీయ పోషణ అభియాన్



**వలిగొండ, సెప్టెంబర్ 29 (తొలి అక్షరం):** వెల్వర్తి సెక్టార్‌లోని లోతుకుంట అంగన్వాడి కేంద్రంలో జాతీయ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్ హేమలత హాజరై మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే పోషక విలువలున్న ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలను వినియోగించుకొని పోషకాహార లోపాన్ని నివారించుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం పోషణ మాసం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండు రాములు, అంగన్వాడి టీచర్ రాచకొండ విజయ, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవతలను అవమానించారని బీజేపీ నిరసన

### - వలిగొండలో రాస్తారోకో.. పోలీసులతో కార్యకర్తల తోపులాట

**వలిగొండ, సెప్టెంబర్ 29 (తొలి అక్షరం):** హిందూ దేవతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వలిగొండ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో, ధర్నా చేపట్టారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా బీజేపీ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఏల చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు బోల సుదర్శన్, తానేష్ గౌడ్, మందుల నాగరాజు, రాచకొండ కిష్టయ్య, బచ్చు శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, మైసోలో రామ్ నర్సు, కీర్తి వెంకటేశం, గంగదారి దయాకర్, లోడ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానం - ప్రాణదానం

### • స్వచ్ఛంద రక్తదానానికి యువత ముందుకు రావాలి: డీఎంహెచ్ఓ డా. రామారావు





**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్- 29:** ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవాలు, తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రామారావు అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడేందుకు ఆరోగ్యవంతులైన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ (జెడ్పీ సెంటర్), ప్రభుత్వ ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరాలు నిర్వహించారు. డా. రామారావు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని తెలిపారు. 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు, 45 కిలోలకు పైగా బరువు ఉన్న ఆరోగ్యవంతులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించడంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, వైద్య సిబ్బందితో రక్తదాన ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన విద్యార్థులు, యువకులను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. నరేంద్ర, అడిషనల్ డీఎంహెచ్ఓ డా. ఎల్. ప్రవీణ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. శంకర్, డీపీసీయూ ప్రతినిధి నాగయ్య, వైద్యులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామన్నపేట వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్ టీచర్‌కు 'విద్యా సేవా రత్న అవార్డు'




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 29:** గత 27 సంవత్సరాలుగా నిరంతరాయంగా విద్యారంగంలో విశేష సేవలందిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న స్థానిక వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయిని అస్మా టీచర్ కు అరుదైన గౌరవం దక్కింది. (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో విద్యాబోధనలో ఆమె కనబరుస్తున్న ప్రతిభ, నిబద్ధతకు గుర్తింపుగా 'విద్యా సేవా రత్న అవార్డు' ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత అస్మా టీచర్ ను పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్ , ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

## ఆరెగూడెంలో ఎల్లమ్మ తల్లి దర్శనం – దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 29:** చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామంలో సర్పంచ్ నాగంపల్లి శ్యామ్ ఇంట్లో నిర్వహించిన పండుగ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి, నాగంపల్లి కిషోర్, శ్రీనివాస్ రెడ్డి, బిక్షం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి డీసీసీ ఉపాధ్యక్షుడిగా కే. నరసింహారెడ్డి

### - ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఉపాధ్యక్షుడు



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 29:** ఫరూఖ్‌నగర్ మండలం చిలకమర్రి గ్రామానికి చెందిన కే. నరసింహారెడ్డి (కే. ప్రతాప్ రెడ్డి కుమారుడు) రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నూతన బాధ్యతలు స్వీకరించిన కే. నరసింహారెడ్డి (చిలకమర్రి నరసింహారెడ్డి) షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సన్మానించి, తన నియామకానికి సంబంధించిన విషయాలను తెలియజేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని కే. నరసింహారెడ్డి తెలిపారు. పార్టీ నాయకత్వం నిర్దేశించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో, పార్టీ రాష్ట్ర నాయకత్వం మార్గదర్శకత్వంతో కాంగ్రెస్ పార్టీని అన్ని స్థాయిల్లో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఆ ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పాముల అడివయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంతారం కృష్ణ భీమయ్య తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# గంట్లకుంటలో ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ





**- అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక ఐలమ్మ: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**పెద్దవంగర, సెప్టెంబర్ 29 (తొలి అక్షరం):** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పాలకుర్తి నియోజకవర్గంలో జన్మించడం నియోజకవర్గ ప్రజలందరికీ గర్వకారణమని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని గంట్లకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ అణచివేత, అన్యాయానికి వ్యతిరేకంగా ఆత్మగౌరవం కోసం ఐలమ్మ ధైర్యంగా పోరాడారని కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ అసామాన్యమైన ధైర్యసాహసాలతో ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మహిళా శక్తి, సామాజిక న్యాయం, ఆత్మగౌరవానికి ఐలమ్మ జీవితం గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఒక వర్గానికే పరిమితమైన నాయకురాలు కాదని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయురాలని అన్నారు. హక్కుల కోసం, అణగారిన ప్రజల కోసం ఆమె చూపిన తెగువ, ధైర్యం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. యువత, మహిళలకు ఐలమ్మ చరిత్రను తెలియజేసి సమానత్వం, సామాజిక న్యాయం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ వారసురాలు చిట్యాల శ్వేతా, సర్పంచ్ పాయిలి యకలక్ష్మి సోమన్న, మండల అధ్యక్షులు రంగు మురళి, వట్టే జనయ్య యాదవ్, కొండ్రాతి శ్రీనాథ్, కొమురుమల్లు, యకయ్య, ఉమచందర్, శ్రీకాంత్, మాజీ గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి గౌడ్, డా. కూరపాటి రమేష్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, చైతన్య రజక సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు

**• డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన**



**చౌటుప్పల్, సెప్టెంబర్ 29 (తొలి అక్షరం):** చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. నగరాభివృద్ధి పథకం కింద రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. పట్టణంలోని పలు వార్డుల్లో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు అంతర్గత రహదారులను మెరుగుపరిచేలా పనులు చేపట్టనున్నారు. డ్రైనేజీ పనులకు రూ.8.50 కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.6.50 కోట్లు కేటాయించారు. 13వ వార్డులో రూ.7 కోట్లతో, 14వ వార్డులో రూ.1 కోటితో, 10వ వార్డులో రూ.50 లక్షలతో డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. సీసీ రోడ్లలో భాగంగా 8, 9వ వార్డుల్లో రూ.2.50 కోట్లతో, 14వ వార్డులో రూ.1 కోటితో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1 నుంచి 20వ వార్డుల్లో వివిధ ప్రాంతాల్లో మరో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, అధికారులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చదరంగ పోటీల్లో శ్రీ కాకతీయ విద్యార్థి గౌతమ్ ప్రతిభ

**అండర్16 చెస్‌లో గౌతమ్‌కు తృతీయ స్థానం**

**శ్రీ కాకతీయ హైస్కూల్ ప్రిన్సిపల్ స్వాతి రెడ్డి**



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 29:** షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ కాకతీయ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి గౌతమ్ చదరంగ పోటీల్లో ప్రతిభ చాటాడు. షాద్‌నగర్‌లోని పతంజలి యోగా సెంటర్‌లో షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్ 2026లో అండర్16 విభాగంలో తృతీయ స్థానం సాధించాడు. పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ట్రోఫీని కైవసం చేసుకున్న గౌతమ్ పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. విద్యార్థి విజయాన్ని పురస్కరించుకుని శ్రీ కాకతీయ హైస్కూల్ ప్రిన్సిపల్ స్వాతి రెడ్డి గౌతమ్‌కు ట్రోఫీ, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. అలాగే విద్యార్థికి శిక్షణ అందించిన చెస్ మాస్టర్ వానరాసి జగన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. చదరంగం విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఆలోచనా శక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గౌతమ్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# అంజనాపురం పామాయిల్ ఫ్యాక్టరీలో భారీ ప్రమాదం

**• ట్యాంక్ పేలడంతో వేల లీటర్ల ఎఫ్లుయెంట్ నీరు బయటకు.. తప్పిన ప్రాణాపాయం**








**కొణిజర్ల, సెప్టెంబర్ 29 (తొలి అక్షరం):** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలోని గోద్రెజ్ ఆగ్రోవేట్ లిమిటెడ్ పామాయిల్ ఫ్యాక్టరీలో సోమవారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో సుమారు 30 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఎఫ్లుయెంట్ ట్యాంక్ పేలినట్లు సమాచారం. ట్యాంక్ నుంచి పెద్ద మొత్తంలో ఎఫ్లుయెంట్ నీరు బయటకు వచ్చి పరిసర భూముల్లోకి చేరినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించిన ఫ్యాక్టరీ సిబ్బంది జేసీబీల సహాయంతో నీరు మరింతగా వ్యాపించకుండా మట్టి కట్టలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే ప్రమాదం అనంతరం ఫ్యాక్టరీ పరిసరాల్లో రసాయన వాసనలు వస్తున్నాయని కార్మికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్లుయెంట్ ప్రభావంతో భూమి, నీటి వనరులకు నష్టం వాటిల్లిందా అనే అంశంపై అధికారులు పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎఫ్లుయెంట్ నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఘటనపై ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది.

# ఘనంగా జర్నలిస్టుల అక్షర సేనాని డా.జి.జితేందర్ రావు జన్మదిన వేడుకలు

**• కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పస్తం సైదులు • గజమాలతో ఘనంగా సత్కరించిన జర్నలిస్ట్‌లు • మాజీ ప్రధాని పి.వి.కుమారుడు ప్రభాకర్ రావు మార్గదర్శకత్వం అమూల్యం • జర్నలిస్టుల హక్కుల పోరాటంలో వెనకడుగు వేసేదే లేదు • టివైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా.తనుగుల జితేందర్ రావు**




కేక్ కట్ చేస్తున్న టివైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా.తనుగుల జితేందర్ రావు



డా.తనుగుల జితేందర్ రావు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షులు పస్తం సైదులు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్ 29:** జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టివైజెఎఫ్) ప్రయాణం సాగుతుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డా.తనుగుల జితేందర్ రావు స్పష్టం చేశారు. సోమవారం కాప్రాలోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టు ప్రతినిధులు, శ్రేయోభిలాషుల నడుమ సంబరాలు ఆత్మీయంగా సాగాయి. **ఉప్పొంగిన ఆత్మీయత.. మహబూబాబాద్‌లోనూ కేక్ కటింగ్:** హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో డా. జితేందర్ రావును జర్నలిస్ట్ నేతలు గజమాలతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నాయకుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. టివైజెఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పస్తం సైదులు ప్రత్యేకంగా కేక్ కట్ చేసి, డా. జితేందర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. డా.జితేందర్ రావు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సమాజ హితమే లక్ష్యంగా మరెన్నో విజయవంతమైన పోరాటాలు సాగించాలని టివైజెఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పస్తం సైదులు ఆకాంక్షించారు. **పి.వి.ప్రభాకర్ రావు ప్రోత్సాహం మరవలేనిది: డా.జితేందర్ రావు** తనను నిరంతరం ప్రోత్సహిస్తున్న భారతరత్న, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు కుమారుడు, టివైజెఎఫ్ ఛాంబర్స్ కమిటీ చైర్మన్ పి.వి. ప్రభాకర్ రావుకు డా. జితేందర్ రావు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులకు ఎదురవు తున్న వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు, సంస్థాగత బలోపేతానికి ఆయన ఇస్తున్న మార్గదర్శకత్వం ఎంతో బలనిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఆయన అందించే సహకారంతో జర్నలిస్టు వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. **యువ విలేకరులకు కొండంత అండ:** జర్నలిస్టుల అక్రిడిటేషన్ల సాధనతో పాటు, సమస్య ఏదైనా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో జితేందర్ రావు ముందుంటారని సమావేశంలో పాల్గొన్న పలువురు సీనియర్ జర్నలిస్టులు ప్రశంసించారు. యువ విలేకరులలో ఆత్మవిశ్వాసం నింపుతూ, సరైన దిశానిర్దేశం చేస్తున్న దార్శనికుడని కొనియాడారు. జర్నలిస్టుల ఐక్యతను కాపాడుతూ, వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని, వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ డా. జితేందర్ రావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల టివైజెఎఫ్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విలేకరులు, మిత్రబృందం పాల్గొన్నారు.

# కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా ఎల్లో కలర్ డే

**- పసుపు రంగులో మెరిసిన చిన్నారుల సందడి**




**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 29:** షాద్‌నగర్ భాగ్యనగర్ కాలనీలోని కృష్ణవేణి పాఠశాలలో ఎల్లో కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక వికాసం, రంగులపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రీప్రైమరీ విద్యార్థులు పసుపు రంగు దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ఇళ్ల నుంచి పసుపు రంగు పండ్లు, సన్‌ఫ్లవర్ పూలు, వివిధ ఆటవస్తువులను తీసుకొచ్చి ప్రదర్శించారు. పాఠశాల ప్రాంగణం మొత్తం పసుపు రంగు శోభతో ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు కథలు, పాటల ద్వారా పసుపు రంగు ప్రాముఖ్యతను, అది సూచించే సంతోషం, ఉత్సాహం, జ్ఞానాన్ని చిన్నారులకు వివరించారు. ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పిల్లలకు రంగులను గుర్తించే సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతిలో వాటి ప్రాధాన్యతను తెలియజేయడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కోహ్లీని స్వేచ్ఛగా ఆడనిస్తే ఒంటిచేత్తో గెలిపిస్తాడు



**• భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల వర్షం**

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల వర్షం కురిపించాడు. తిరువనంతపురం వేదికగా పర్యాటక వెస్టిండీస్ జట్టుతో ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ గిల్, స్టార్ ఆటగాడు కోహ్లీ శతకాలతో రెచ్చిపోయారు. ఫలితంగా ప్రత్యర్థి నిర్దేశించిన 295 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా 41.4 ఓవర్లలోనే చేరుకుంది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ గిల్ స్పందిస్తూ, మ్యాచ్ అనంతరం కెప్టెన్ శుభ్మన్ గిల్ మాట్లాడుతూ, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. 'విరాట్ భాయ్‌ను తన ఆటను ఆస్వాదించనివ్వాలి. అతడిని ఎలాంటి ఒత్తిడికి గురిచేయాల్సిన అవసరం లేదు. తనదైన రోజున ఎలాంటి మ్యాచ్‌నైనా ఒంటిచేత్తో గెలిపించగల సత్తా అతడికి ఉంది. ప్రస్తుతం కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు' అని గిల్ అన్నాడు. ఇదే మ్యాచ్‌లో కోహ్లీ 15,000 వన్డే పరుగుల మైలురాయిని అందుకోవడం విశేషం. తన సెంచరీ సంతోషాన్నిచ్చినా, మ్యాచ్‌ను ముగించలేకపోయాననే స్వల్ప అసంతృప్తి ఉందని గిల్ వ్యాఖ్యానించాడు. కాగా, ఈ మ్యాచ్‌లో కోహ్లీ 88 బంతుల్లో 139 పరుగులు చేయగా, గిల్ 110 రన్స్ చేశారు. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యాన్ని దక్కించుకుంది.

# ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ రికార్డ్ బ్రేక్..



**• 5 రోజుల్లో 3మెడల్స్ గెలిచిన గుల్వీర్**

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్స్ పతకాల పంట పండిస్తున్నారు. మూడు పతకాలు సాధించిన రెండవ భారతీయ అథ్లెట్‌గా గుల్వీర్ సింగ్ నిలిచారు. గతంలో ఈ చారిత్రాత్మక రికార్డు దిగ్గజ భారతీయ అథ్లెట్ పి.టి. ఉష పేరిట ఉండేది. పి.టి. ఉష 1986 సియోల్ ఆసియా క్రీడల్లో నాలుగు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకాన్ని గెలుచుకున్నారు. 1986 ఆసియా క్రీడల తర్వాత మొదటిసారిగా ఒక భారతీయ క్రీడాకారుడు పతకాల హ్యాట్రిక్ సాధించాడు. ఆసియా క్రీడలలో గుల్వీర్ ప్రయాణం ఒక సినిమా కథను తలపించేలా సాగింది. అతను కేవలం ఐదు రోజుల్లోనే నాలుగు పరుగుల పోటీలలో పాల్గొన్నాడు. 1,500 మీటర్ల నుండి 10,000 మీటర్ల వరకు జరిగిన వివిధ ఈవెంట్లలో అతను ట్రాక్‌పైకి దిగి, ప్రతిసారీ పతకం సాధించాడు. గుల్వీర్ సాధించిన చారిత్రాత్మక హ్యాట్రిక్ పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంతో మొదలైంది. అతను ఈ పందెన్ని 28:29.38 నిమిషాల్లో పూర్తి చేసి రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఆ తర్వాత 1,500 మీటర్ల పరుగులో 3:36.72 సమయంతో తన వ్యక్తిగత అత్యుత్తమ రికార్డును నమోదు చేసి మరో రజత పతకాన్ని సాధించాడు. వరుసగా మూడు రేసుల వల్ల కలిగిన ఒత్తిడి, అలసట ఉన్నప్పటికీ, గుల్వీర్ ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. పురుషుల 5000 మీటర్ల ఫైనల్‌లో 13:32.75 సమయంతో మూడవ స్థానంలో నిలిచి, అతను కాంస్య పతకాన్ని సాధించాడు. జపాన్‌లో ఐదు రోజుల్లో మూడు పతకాలు సాధించడం ద్వారా గుల్వీర్ భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించాడు. ఈ ఘనతతో భారత అథ్లెటిక్స్ చరిత్రలో అతని పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆసియా క్రీడల తర్వాత ఇప్పుడు ఒలింపిక్స్‌లోనూ అటువంటి ప్రదర్శనే చేసి భారత్ కోసం పతకం సాధించాలని గుల్వీర్ ఆశిస్తున్నాడు. ఆసియా ఒలింపిక్స్‌లో గుల్వీర్ సింగ్ రికార్డు బ్రేక్ చేయడమే కాకుండా వరుసగా నాలుగు పతకాలు సాధించడం పట్ల కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా అభినందిస్తూ పోస్ట్ పెట్టారు. నీలాంటి వాళ్లు దేశఖ్యాతిని పెంచిన ఛాంపియన్స్ అంటూ కితాబిచ్చారు.

# రీఎంట్రీ ఇవ్వనున్న సిరాజ్

**- టీమిండియా మరో ఆసక్తికరపోరుకు సిద్ధం**

**-వెస్టిండీస్‌తో రెండో వన్డేకు భారత తుది జట్టు ప్రకటన**



వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికరపోరుకు సిద్ధమైంది. గువహతి వేదికగా బుధవారం జరగనున్న రెండో వన్డేలో పర్యాటక విండీస్‌తో ఆతిథ్య భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్‌ల విధ్వంసకర శతకాలతో తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో వన్డేలోనూ విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనుకుంటోంది. తద్వారా ఆఖరి వన్డేలో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. మరోవైపు తొలి వన్డేలో చేసిన తప్పిదాలను సరిచేసుకొని రెండో మ్యాచ్‌లో విజయం సాధించాలనే పట్టుదలతో వెస్టిండీస్ ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి వన్డేకు దూరంగా ఉన్న మహమ్మద్ సిరాజ్.. ఈ మ్యాచ్ ఆడే అవకాశం ఉంది. సిరాజ్ కోసం ప్రసిధ్ కృష్ణకు విశ్రాంతి ఇవ్వవచ్చు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా ఆడనుండగా.. విరాట్ కోహ్లీ ఫస్ట్ డౌన్‌లో ఆడనున్నాడు. రుతురాజ్ గైక్వాడ్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. తొలి వన్డేలో ఈ నలుగురికే బ్యాటింగ్ చేసే అవకాశం రాగా.. కోహ్లీ, గిల్ శతకాలతో చెలరేగారు. 32 పరుగులతో రోహిత్ పర్వాలేదనిపించినా.. అతను భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి తర్వాతి స్థానాల్లో బౌలింగ్ చేయనున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడనున్నాడు. తొలి వన్డేలో కుల్దీప్ యాదవ్ 4 వికెట్లతో సత్తా చాటాడు. గువాహటి భారత్‌కు కలిసొచ్చిన మైదానం. ఇక్కడ ఆడిన రెండు వన్డేల్లోనూ టీమిండియా గెలిచింది. కోహ్లీ ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ సెంచరీలు చేయగా, రోహిత్ శర్మ కూడా ఓ సెంచరీ, ఓ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ వేదికపై జరిగిన నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లోనూ 300కు పైగా పరుగులు నమోదయ్యాయి. దీంతో మరోసారి బ్యాటర్లదే ఆధిపత్యంగా సాగే అవకాశం కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో మార్పులు ఉంటాయా అన్నది ఆసక్తికరంగా మారింది. తొలి వన్డేలో మహ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ బెంచ్‌కే పరిమితమయ్యారు. ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వడంతో పాటు యశస్వి జైస్వాల్‌ను కూడా ఆడించే ఆలోచన ఉండొచ్చని తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, జియోహాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ ఉంటుంది. తొలి వన్డేలో కోహ్లీ 88 బంతుల్లో అజేయంగా 139 పరుగులు చేశాడు. గిల్ 108 బంతుల్లో 110 పరుగులతో మెరిశాడు. వెస్టిండీస్ తరఫున జాన్ క్యాంప్‌బెల్ 60 బంతుల్లో 62, జస్టిన్ గ్రీవ్స్ 108 బంతుల్లో 101 పరుగులు చేశారు. ఒక దశలో విండీస్ 19 ఓవర్లకు వికెట్ నష్టపోకుండా 135 పరుగులు చేసింది. ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ (4/40) అద్భుత బౌలింగ్ తో కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు.వెస్టిండీస్‌తో రెండో వన్డేకు భారత తుది జట్టు(అంచనా)రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణ.వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు :శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహమ్మద్ సిరాజ్, అకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.



# కోహ్లీ కెప్టెన్సీకి నేను వీరాభిమానిని..

**- ఆ వార్తలను చూసి నవ్వుకుంటాం:మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసల జల్లు కురిపించాడు. కోహ్లీ ఏ మాత్రం మారలేదని, అతనితో బ్యాటింగ్ చేయడం చాలా సరదాగా ఉంటుందని చెప్పుకొచ్చాడు. తమ మధ్య విభేదాలు ఉన్నాయంటూ వచ్చే వార్తలను చూసి ఇద్దరం నవ్వుకుంటామని తెలిపాడు. విరాట్ కోహ్లీ టెస్ట్ కెప్టెన్సీకి తాను వీరాభిమానిని అని చెప్పాడు. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను విరాట్ కోహ్లీ సెంచరీతో మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. తొలి వన్డేలో విధ్వంసకర శతకంతో చెలరేగిన కోహ్లీ.. భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. తాజాగా జియో హాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ గురించి రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జట్టును గెలిపించాలనే తపన అతనిలో ఏ మాత్రం తగ్గలేదన్నాడు. 'విరాట్ కోహ్లీ భారత జట్టు కోసం ఏం చేశాడనేది అందరికీ తెలుసు. దాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. ప్రతీ రోజు మైదానంలోకి రావడం, బాగా ప్రాక్టీస్ చేయడం, పరుగులు సాధించి భారత్‌ను గెలిపించడం... కోహ్లీ దినచర్య. ఈ విషయంలో ఏది మారలేదు. తను కెప్టెన్‌గా ఉన్నప్పుడైనా.. నేను సారథిగా ఉన్నా కోహ్లీ మారలేదు. ఇక ముందు కూడా మారడు. టెస్ట్ కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ భారత జట్టును నడిపించిన తీరు అద్భుతం. అతని టెస్ట్ కెప్టెన్సీకి నేను వీరాభిమానిని. ఇప్పటికీ మా ఇద్దరి మధ్య ఆటను ఎలా మెరుగుపర్చుకోవాలో అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. మా ఇద్దరి మధ్య ఏదో గొడవ ఉందంటూ టీవీల్లో వచ్చే వార్తలను చూసి మేం నవ్వుకుంటాం. జనాలు 'మసాలా' వార్తలు కోరుకుంటారు. అందుకే అలాంటి కథనాలు వస్తుంటాయి. నేను 2007లో, విరాట్ 2008లో అరంగేట్రం చేశాం. దాదాపు ఒకే సమయంలో కెరీర్ మొదలుపెట్టి సుదీర్ఘ కాలంగా భారత జట్టుకు ఆడుతున్నాం. మా ఇద్దరి విధానం వేరు కావచ్చు. కానీ ప్రపంచకప్ గెలవాలి అనే లక్ష్యం మాత్రం ఒకటే. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు మా మధ్య మంచి బాండింగ్ ఉంటుంది. ఎవరి బౌలింగ్‌లో అటాక్ చేయాలి? ఎప్పుడూ సింగిల్ తీయాలి? అని ప్లాన్ చేసుకుంటాం. నా కాలుకేమైనా సమస్య అనిపిస్తే.. 'భయ్యా.. కాస్త చూసి పరుగెత్తు. నా కాలు కాస్త ఇబ్బందిగా ఉంది'అని విరాట్‌తో చెబితే.. తను వెంటనే అర్థం చేసుకొని సహకరిస్తాడు. తన ఆటనే మార్చుకుంటాడు. కోహ్లీకి ప్రపంచకప్ ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారత జట్టులో అత్యధికంగా 4 వన్డే ప్రపంచకప్‌లు(2011, 2015, 2019, 2023) ఆడిన అనుభవం అతనికి మాత్రమే ఉంది. 2007 ప్రపంచకప్ అయినా.. మరో టోర్నీ అయినా విజయం కోసం కోహ్లీ ఎంతలా పరితపిస్తాడో అందరికి తెలుసు. బ్యాటింగ్ సమస్యల గురించి ఇద్దరం మాట్లాడుకుంటాం. ఒకరికొకరం సలహాలు ఇచ్చుకుంటాం. కానీ ఇప్పుడు మేమిద్దరం వన్డేలు మాత్రమే ఆడుతుండటంతో ఎక్కువగా కలవలేకపోతున్నాం. పైగా అతను నాకు చాలా దూరంగా నివసిస్తున్నాడు. గతంలో కాకుండా ఇప్పుడు ఇంట్లో కుటుంబంతో ఎక్కువ సమయం గడపడానికి మాకు టైమ్ దొరుకుతుంది.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

# ర్యాంకింగ్స్‌లో శ్రీ చరణి సరికొత్త రికార్డు



భారత యువ స్పిన్నర్ శ్రీ చరణి ఐసీసీ మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. కెరీర్‌లోనే అత్యుత్తమంగా 817 రేటింగ్ పాయింట్లకు చేరుకుంది. దీంతో 2018 నవంబర్‌లో ఆస్ట్రేలియా బౌలర్ మేగన్ షట్ సాధించిన 806 పాయింట్ల రికార్డును అధిగమించింది. మహిళల టీ20 క్రికెట్లో మరే బౌలర్ ఇప్పటివరకు ఈ స్థాయిలో రేటింగ్ అందుకోలేదు. ఇప్పటికే టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్‌గా ఉన్న చరణి.. ఇప్పుడు ఆ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో చరణి అద్భుతంగా రాణించింది. జపాన్‌పై 4/10తో కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేసింది. అనంతరం శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టింది. ఈ మ్యాచ్‌లో భారత్ 147 పరుగుల తేడాతో గెలిచి స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఆసియా కప్‌లోనూ చరణి కీలక పాత్ర పోషించింది. టోర్నీలో 12 వికెట్లు తీసుకుంది. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 4/20తో అదరగొట్టింది. దీంతో భారత్ 72 పరుగుల తేడాతో విజయం సాధించి ఎనిమిదోసారి ఆసియా కప్ టైటిల్ దక్కించుకుంది. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత మరో స్టార్ దీప్తి శర్మ కూడా ముందుకు వచ్చింది. ఆసియా క్రీడల ఫైనల్లో మూడు వికెట్లు తీసుకున్న ఆమె 754 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎక్లెస్టోన్ 723 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. టీ20 బ్యాటింగ్ ర్యాంకిం గ్స్‌లో స్మృతి మంధాన కూడా టాప్-5లోకి తిరిగి వచ్చింది. ఆసియా క్రీడల ఫైనల్లో శ్రీలంకపై 79 పరుగులు చేయడంతో ఆమెకు ఈ స్థానం దక్కింది.

# రకుల్ ప్రీత్ సింగ్‌పై ఐటీ దాడులు..



ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ గారు, ప్రముఖ నిర్మాత వషు భగ్నానీ, వారికి సంబంధించిన పనోరమ స్టూడియోస్‌తోపాటు మొత్తం 12 ప్రదేశాల్లో ఏకకాలంలో ఇన్‌కమ్ టాక్స్ అధికారులు దాడులు నిర్వర్తిస్తున్నారు. ముంబైలో సోదాలు వ్యవహారం బయటకు రావడంతో ఒక్కసారిగా బాలీవుడ్ సినీ పరిశ్రమలోని ప్రముఖులు ఉలిక్కిపడ్డారు. రకుల్ ప్రీత్ ఫ్యామిలీ నివాసాలు, కార్యాలయాలపై దాడులు నిర్వహించడం వెనుక కారణాలను ఆరా తీశారు. ఈ వ్యవహారం బాలీవుడ్ మీడియాలో కలకలం రేపింది. రకుల్ ప్రీత్ సింగ్, ఆమె భర్త జాకీ భగ్నానీ, వషు భగ్నానీపై ఆదాయపు పన్ను ఎగవేత, నిధుల నిర్వాహణలో అవతకవలు, మనీ లాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారంటూ వారి భాగస్వాములు, పెట్టుబడి దారులు ఆరోపణలు, ఫిర్యాదు చేయడంతో ముంబై ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. సోమవారం అంటే సెప్టెంబర్ 28వ తేదీ ఉదయం నుంచే ఐటీ అధికారులు ముంబైలోని పలు ప్రదేశాల్లో దాడుల చేసి సోదాలు చేస్తున్నారు. వారి నిధులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ వ్యవహారాలు, ఓవర్సీస్‌లో ఫైనాన్షియల్ ట్రాన్స్‌జాక్షన్ వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. జాతీయ టెలివిజన్ ఛానెల్ ఎన్డీటీవీ వెల్లడించిన కథనం ప్రకారం.. సినిమాల నిర్మాణానికి సంబంధించి ఫైనాన్స్ వ్యవహారాలు, విదేశాలకు అక్రమంగా తరలించిన డబ్బు విషయంపై వెలుగు చూసిన అవకతవకల గురించి, ఇతర ఫైనాన్స్ వ్యత్యాసాల గురించి ప్రశ్నిస్తున్నారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు అని తెలిపింది. అయితే ఈ దాడులకు సంబంధించిన వివరాలు అందాల్సి ఉంది. ఈ రైడ్స్‌పై రకుల్ గానీ, భగ్నానీ కుటుంబం గానీ స్పందించలేదు. వషు భగ్నానీ విషయానికి వస్తే.. బాలీవుడ్‌లో అగ్ర నిర్మాతగా పేరు సంపాదించారు. ఆయన పూజా ఫిలింస్ అనే బ్యానర్‌పై పలు చిత్రాలను నిర్మించారు. పంపిణీ రంగంలో కూడా ఉన్నారు. అయన కుమారుడు ప్రస్తుతం తమ సంస్థ వ్యవహారాలను చూసుకొంటున్నారు. ఇటీవల జాకీని రకుల్ ప్రీత్ సింగ్ ప్రేమించి పెళ్లి చేసుకోవడం తెలిసిందే. ఇటీవల వారి సంస్థ హై జవానీతో ఇష్క్ హోనా హై సినిమాను రిలీజ్ చేయడం తెలిసిందే.

# ఆచీతూచీ పాత్రలవైపు జాన్వీ కపూర్ అడుగులు

జాన్వీ కపూర్ ప్రస్తుతం ఆచీతూచీ పాత్రలను ఎంచుకుంటున్నారు. పెద్ది చిత్రం విడుదలైన తర్వాత, ఆమె హైదరాబాద్‌లోని ప్రచార కార్యక్రమాలకు, బహిరంగ వేదికలకు దూరంగానే ఉంటున్నారు. పెద్ది చిత్రంలో తన పాత్రను, ముఖ్యంగా గ్లామరస్ కోణంలో చూపించిన విధానం పట్ల జాన్వీ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే, ఆ సినిమాకు సంబంధించిన ప్రచార కార్యక్రమాల్లో ఆమె పాల్గొనడాన్ని పరిమితం చేసుకున్నారు. బాలీవుడ్‌లో కూడా జాన్వీ శరవేగంగా ప్రాజెక్ట్‌లకు సైన్ చేసేలా కనిపించడం లేదు. ఆమె తన కెరీర్ తదుపరి దశను అంచనా వేయడానికి సమయాన్ని వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. సాంప్రదాయిక ఆకర్షణీయమైన, వాణిజ్య పాత్రలకు మించి కనిపిస్తుంది.ఇంకా బలమైన పాత్రలను అందించే మరిన్ని పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పార్ట్‌లను తీసుకోవడానికి ఆసక్తి చూపుతుందని తెలుస్తోంది. ఆమె అల్లు అర్జున్ రాకాకు సంతకం చేసిందని టాక్ వస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో ఆమె ప్రమేయం గురించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన లేదు. ప్రస్తుతానికి, జాన్వి తన కెరీర్ ఎంపికల విషయంలో మరింత జాగ్రత్త తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



# జైలర్ 2లో అనిరుధ్ జైలర్ టైటిల్ ట్రాక్




2023లో విజయవంతమైన చిత్రం 'జైలర్'కు సీక్వెల్ అయిన 'జైలర్ 2' కోసం ఉత్సాహం పెరుగుతోంది. ఈ చిత్రంలో రజనీకాంత్ ముత్తువేల్ 'టైగర్' పాండియన్ పాత్రలో నటించగా, విద్యా బాలన్ మరియు ఇతరులు ఆయనతో పాటు నటిస్తున్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 15, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దీని ప్రమోషన్లలో భాగంగా సెప్టెంబర్ 29-30 తేదీలలో 'వన్ నేమ్' లిరిక్ వీడియో, అక్టోబర్ 5న ఒక గ్రాండ్ ట్రైలర్, మరియు ప్రత్యేక ఫ్యాన్ ఈవెంట్‌లు జరగనున్నాయి. కన్నడ డబ్బింగ్ ముగింపు దశకు చేరుకుంటుండగా మరియు జర్మనీ వంటి అంతర్జాతీయ విడుదలలకు సన్నాహాలు జరుగుతుండగా, అభిమానులు భారీ సమావేశాలు, యానిమే ఆర్ట్ వంటి సృజనాత్మక నివాళులు, మరియు వ్యక్తిగత సంభాషణల వీడియోలను పంచుకుంటున్నారు. ఇవి అధికారిక ప్రచారంతో పాటు సహజమైన ఉత్సాహాన్ని కూడా మేళవిస్తున్నాయి. ఇదిలా వుండగా, గతంలో అనిరుద్ సాంగ్స్ అంటే వచ్చే పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వీటికి రాలేదు. కానీ నేడు రానున్న అవైటెడ్ జైలర్ టైటిల్ ట్రాక్ మాత్రం యునానిమస్ స్పందన అందుకోవడం గ్యారెంటీ అనిపిస్తుంది. ఈ టైటిల్ ట్రాక్ ఆల్రెడీ పార్ట్ వన్ లో హిట్ అయింది. సీక్వెల్ విషయానికొస్తే ఈ ప్రాజెక్టుని అనౌన్స్ చేసినప్పుడు విడుదల చేసిన ప్రోమో కట్ లో అనిరుద్ ఇచ్చిన రీమిక్స్ కి సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. సో జైలర్ 2 నుంచి ఇప్పుడు వరకు వచ్చిన రెండు సాంగ్స్ కంటే ఇది బెటర్ గా ఉండడమే కాకుండా అంచనాలు కూడా పెంచుతుంది అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# డబుల్ ఇస్మార్ట్‌తో 35 కోట్ల నష్టం



డబుల్ ఇస్మార్ట్ సినిమా డిస్ట్రిబ్యూషన్ సమయంలో ఎదురైన ఆర్థిక సవాళ్లు మరియు మానసిక ఒత్తిళ్ల గురించి చైతన్య రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పూరీ జగన్నాథ్, చార్మిల మాటలు నమ్మి సహకరించామని, కానీ సినిమా విడుదలయ్యాక తమను పూర్తిగా పక్కన పెట్టారని హనుమాన్ సినిమా నిర్మాత చైతన్య రెడ్డి ఆరోపించారు. ఈ పరిణామాల వల్ల తీవ్ర డిప్రెషన్‌కు గురై పరిశ్రమ నుంచి వైదొలగాలని కూడా భావించినట్లు చెప్పారు.అయినప్పటికీ, నటుడు సాయి దుర్గా తేజ్, కుటుంబ సభ్యుల మద్దతుతో ఆ కష్టకాలం నుంచి బయటపడ్డామని ఆమె తెలిపారు. పరిశ్రమలో ఇతరులు ఇటువంటి సమస్యలను ఎదుర్కోకూడదనే ఉద్దేశంతోనే ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఎలక్షన్స్‌లో కూడా పోటీ చేసినట్లు స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరగాలనేదే తమ ప్రధాన ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఆమె హిట్ టీవీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రైమ్ షో బ్యానర్ కేవలం సినిమాల నిర్మాణమే కాదు.. డిస్ట్రిబ్యూషన్ రంగంలో కూడా యాక్టివ్‌గా ఉన్నాం. హనుమాన్ సినిమా తర్వాత మేము డబుల్ ఇస్మార్ట్ మూవీ రిలీజ్ చేయాలని నిర్ణయం తీసుకొన్నాం. అయితే పూరి జగన్నాథ్, చార్మీ రిక్వెస్ట్ మేరకు నిర్మాత నిరంజన్ రెడ్డి సినిమాను చంపకూడదు అనే ఉద్దేశంతో ఆ సినిమా తీసుకొన్నాం. డబుల్ ఇస్మార్ట్ సినిమా డిస్ట్రిబ్యూషన్ విషయంలో మా మధ్య ఓ అగ్రిమెంట్ జరిగింది. వారి పాత సినిమాలకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే వారే అడ్జస్ట్ చేయాలి అని ఒప్పందం జరిగింది అని తెలిపారు. అయితే డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు 15వ తేదీన రిలీజ్ డేట్ పెట్టారు. మా అగ్రిమెంట్ చేసుకొన్న ప్రకారం.. ఎలాంటి సమస్య వచ్చినా మేము సపోర్ట్ చేస్తామని చెప్పారు. కానీ ఆగస్టు 10వ తేదీ వరకు కూడా డిస్ట్రిబ్యూటర్లు పాత సినిమా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సినిమా రిలీజ్‌కు సమస్యలు ఏర్పడ్డాయి. దాదాపు 25 కోట్ల రూపాయలు అప్పటికే చెల్లించాం. అయినప్పటికీ ఆ సినిమా నుంచి తప్పుకోవాలని డిసైడ్ అయ్యాం. ఆ సమయంలో మీరు చెల్లించిన డబ్బుకు ఏదో ఒక ఏరియా సర్దుబాటు చేసుకోమని సలహా ఇచ్చారు. దాంతో నేను ఆ సినిమా డిస్ట్రిబ్యూషన్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకొన్నాం. కానీ ప్రతీ రోజు పూరీ, చార్మీ ఫోన్ చేసి గంటపాటు మమ్మల్ని కన్విన్స్ చేసే ప్రయత్నం చేశారు. మీరు సినిమాను రిలీజ్ చేయకపోతే మా చచ్చిపోవాల్సిందే. మా జీవితాలు నాశనం అవుతాయి. ఇక మేము సినిమాలు చేయలేని పరిస్థితి అంటూ నిరంజన్‌ను ఉక్కిరి బిక్కిరి చేశారు. అయితే నిరంజన్ రెడ్డి నాకు కాల్ చేస్తే.. నేను సినిమాకు డబ్బు ఇవ్వను, చెక్‌పైనా సంతకాలు పెట్టనని చెబితే.. అప్పుడు ఆగస్టు 13వ తేదీన చార్మీ కాల్ చేసింది. ఈ సినిమా రిలీజ్‌కు ఎలాంటి సమస్య వచ్చిన మా తల తాకట్టు పెడుతాం. మీరు కాదంటే మేము చచ్చిపోవడమే ఉంటుందని అన్నారు. అయినా వారి మాటలపై మాకు నమ్మకం కలుగలేదు అని చైతన్య రెడ్డి చెప్పారు.